క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు చేపట్టారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, నుశేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వార్లకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

వైభవంగా నెలపూజ





చింతలాముని నల్లారెడ్డి స్వామి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెలపూజ శనివారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామల నుంచి మేళతాళలతో భక్తులు ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు ఆకుపూజ, తులసిపూజ, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. నెలపూజకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వహకులు భోజన సౌకర్యం కల్పించారు. సీఐ విజయ భాస్కర్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిబంధనలు పాటించని నవోదయ కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానిక విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, కృష్ణ, శేఖర్, అఫ్రిది ఆరోపించారు. ఆయా సంస్థలపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులపై విచారణ చేసినా చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారన్నారు. వారికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు.

భద్రతా నియమాలు ప్రాణానికి రక్షణ కవచాలు



రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శివరాముడు

పెద్దకడబూరు : రోడ్డు భద్రతా నియమాలు మానవాళి ప్రాణాలకు రక్షణ కవచంలా పని చేస్తాయని ఏఎస్ఐ శివరాముడు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమని, వేగ పరిమితిని పాటించాలన్నాడు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్ట విరుద్ధమన్నారు. రోడ్డు భద్రత అనేది వ్యక్తిగత విషయం కాదని అది సామాజిక బాధ్యత అని గుర్తుచేశాడు.

21 నుంచి పత్తి కొనుగోళ్లు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరులోని పత్తి జిన్నింగ్ మిల్లుల్లో ఈనెల 21వ తేదీ నుంచి సీసీఐ ద్వారా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయనున్నట్లు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యదర్శి చంద్రమౌళి శనివారం తెలిపారు. త్వరలో పత్తి జిన్నింగ్ మిల్లుల మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఆ తరువాత ఏ మండలం నుంచి ఏ మిల్లుకు పత్తి తీసుకెళ్లాలో తెలియజేస్తామన్నారు. ఇందుకు రైతులు తమ మొబైల్ ఫోన్లలో ప్లేస్టోర్‌లోకి వెళ్లి కిసాన్ కపాస్ యాప్‌డౌన్‌లోడ్ చేసుకోని తమ వివరాలను అందుకో నమోదు చేసుకోవాలని సూచించారు. యాప్ గురించి అవగాహన లేకుంటే సమీపంలోని ఆర్‌ఎస్‌కేల్లో వీఏఏలను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

ఆశలు ఆవిరి..!

- అతివృష్టితో అంకుర దశలోనే పంటలు నాశనం
- పెట్టుబడులు నేలపాలు
- ఆదుకోని ప్రభుత్వం
- ఆందోళనలో మిరప రైతాంగం



అధిక వర్షానికి దెబ్బతిన్న మిరప పైరు

మంత్రాలయం : అతివృష్టి.. నిండా ముంచింది. అంకుర దశలోనే ఆశలను మోడు చేసింది. పెట్టుబడులు నేలపాలు చేసి అన్నదాత మోముల్లో నైర్యాశాన్ని నింపింది. మిరప రైతుకు కన్నీళ్లు మిగిల్చింది. నిరుడు మిరప పంటకు గిట్టుబాటు లేక అప్పుల పాలయ్యారు. నేడేమో అతివృష్టి పంట చేతికందక మునుపే చిదిమేసింది. అధిక వర్షాలు కోలుకోలేని దెబ్బతీయడం, ప్రభుత్వం ఆదుకోకపోడవంతో మిరప రైతుల బాధలు వర్ణనాతీతం.

8,372 ఎకరాల్లో మిరప సాగు

మంత్రాలయం నియోజకవర్గంలో పత్తి సాగు తర్వాత మూడో ప్రధాన పంటగా మిరప పంటను వేస్తున్నారు. నియోజకవర్గంలో 8,372 ఎకరాల్లో మిరప సాగు చేశారు. కౌతాళంలోని బదినేహాల్, ఉప్పరహాల్, కుంటనహాల్, రౌడూరు, ఎరిగేరి, కామవరం, పెద్దకడబూరు మండలంలోని కంబదహాల్, హెచ్.మురవణి, దొడ్డిమేకల, పెద్దకడబూరు, కల్లుకుంట, కోసిగి మండలంలోని చింతకుంట, పల్లెపాడు, దొడ్డి బెళగల్, మంత్రాలయం మండలంలోని మాలపల్లి, సుంకేశ్వరి, చెట్నెహళ్లి, పరమాన్‌దొడ్డితండా గ్రామాల్లో ఎక్కువగా మిరప సాగుకు పూనుకున్నారు. పెద్దకడబూరు మండలంలోని ఎర్ర నేలల్లో ఈ సాగు అధికంగా ఉంది.

ఎకరాకు రూ.లక్షకు పైగా ఖర్చు

ఎకరా మిరప సాగుకు లక్షల్లో పెట్టుబడి ఉంటుంది. విత్తు రూపంలో రకాన్ని బట్టి ఎకరాకు రూ.10-15 వేలు ఖర్చు వస్తుంది. నాటుకు రూ.5 వేలు, మొదటి దశ రసాయన ఎరువులకు రూ.5 వేలు, దుక్కికి రూ.4 వేలు ఖర్చు వస్తోంది. అంతేగాక గుంటక పాసేందుకు, కలుపు మొక్కల నివారణకు రూ.10 వేలు వ్యయం అవుతోంది. ఇక మందుల పిచికారీకి గారూ ఎకరాకు ఒక్క దఫాకు రూ.3 వేలు వెచ్చించాల్సి ఉంది. ఇప్పటికే రెండో దశకు మిరప పైర్లు వచ్చాయి. ఇప్పటి వరకు ఎకరానికి రైతులు రూ.లక్షకు పైగా వెచ్చించారు.

అపార నష్టం

అధిక వర్షాలు మిరప రైతులకు తీరని బాధను మిగిల్చాయి. రైతన్న ఆశలను ఆదిలోనే తుంచి వేశాయి. మంత్రాలయం నియోజవర్గంలో ఎక్కువగా సిజెంటా-2023, దేవనూర్ డీలక్స్, సూపర్ డీలక్స్, మైహికో తేజా, సిజెంటా తేజా రకాలు సాగు చేశారు. ఆగస్టు నెలలో ఎడతెరిపి లేని వానలు కురవడంతో మిరప పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పొలాల్లో నీళ్ల చేరడంతో మొక్కలు కుళ్లి చనిపోయాయి. కాయలు పట్టే దశలోనే చేలన్నీ ఎండిపోయాయి. నిన్నటి వరకు కళకళలాడిన పైర్లు నేడు మోడుబారాయి. ముఖ్యంగా కంబలదిన్నె, జాలవాడి, కంబదహాల్, చెట్నెహళ్లి, నూగూరు, కౌతాళం ప్రాంతాల్లో మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.



పూర్తిగా ఎండిన పైరు

కోలుకోలేని దెబ్బ

కూటమి ప్రభుత్వం ఎలాంటి ముహూర్తంలో అధికారం చేతబూనిందో తెలీదు. వ్యవసాయ రంగం పూర్తిగా పతనమైంది. నిరుడు మిరప రైతుకు గిట్టుబాటు ధర లేక రైతులు దివాలు తీశారు. నేడు ఉల్లిని నమ్ముకుంటే దానికీ సరైన ధరలేక కంటతడి పెట్టారు. ఇలా దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది. పీకల్లోతు నష్టాలతో రైతన్న కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. కాగా ఈసారి ప్రకృతి రైతన్న ఆశలను మోడు చేసింది. అధిక వర్షాలు కురవడంతో పత్తి పంట చేతికి రాలేదు. మిరప పంటలు సైతం తడిసి ఎండిపోయాయి. ఎలా గట్టెక్కాలో దిక్కు తోచని స్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారు.

రెండు ఎకరాల్లో పంట నాశనం



రెండు ఎకరాల్లో మిరప పంట వేశా. వానలు రాక ముందు ఎంతో బాగుండె. పంట కోసం రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టాను. వానలు ఎక్కువై పంటంతా నాశనమైంది. ఒక్క మొక్క కూడా బతకలేదు. ఆశలన్నీ అడియాశలాయె. నష్టాన్ని పూడ్చుకునే దిక్కు తోచడం లేదు. పంట నష్టం ఊసేలేదు. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియడం లేదు.

– ఉసేని, పెద్దకడబూరు

రూ.50వేలు నష్టం



ఎకరా పొలంలో మిరప వేశాను. సాగు కోసం రూ.50 వేలకుపైగా పెట్టుబడి పెట్టా. ఇటీవల వాన కురవడంతో మొక్కలన్నీ ఎండిపోయాయి. ఎకరం పైరు పూర్తిగా దెబ్బతింది. చిల్లిగవ్వ రాక ముందే పంట నాశనమైంది. ఏమీ చేయాలో పాలు పోవడం లేదు. మా ఊరిలో కనీసం 30 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ఏ అధికారి తమను పట్టించుకోవడం లేదు.

– రామయ్య, కంబలదిన్నె

సమాజసేవ అలవర్చుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దాక్టర్ హేమంత్ కుమార్

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు చదువులతో పాటు సమాజసేవ చేయడం అలవర్చుకోవాలని స్థానిక ఆర్‌కే కంటి వైద్య శాల ప్రముఖ కంటివైద్య నిపుణుడు డాక్టర్ హేమంత్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని కుర్ణికళ్యాణ మండపంలో ఏబీవీపీ విభాస్ అభ్యాస వర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన స్వామి వివేకానంద, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏబీవీపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ ఏబీవీపీ నిర్మాణాత్మక కార్యక్రమాలు, జాతీయ భావం, దేశభక్తి, జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ ఎర్రిస్వామి, జిల్లా కన్వీనర్లు వీరేష్, యుగంధర్, చంద్రశేఖర్, మారుతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి



సోమలగూడూరులో గోపూజ నిర్వహిస్తున్న టీటీడీ హిందు ధార్మిక సభ్యులు, గ్రామస్తులు

నందవరం : ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు దైవ నామ స్మరణ చేస్తూ సన్మార్గంలో నడవాలని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. చివరిరోజు గోపూజ, లక్ష్మీ నరసింహస్వామికి కుంకుమార్చన, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భగవన్నామ స్మరణ విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రుక్మానందరెడ్డి, ఆనందరెడ్డి, గ్రామ సర్పంచ్ గోవిందు, ఆలయ ధర్మకర్త తెలుగు వీరేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వం



సీపీఎం నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఏ గఫూర్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో కార్పొరేట్ శక్తులకు కూటమి ప్రభుత్వం ఊడిగం చేస్తూ అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తోందని సీపీఎం నేత, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ విమర్శించారు. శనివారం పట్టణంలో సీపీఎం కార్యాలయ నూతన భవనం(పుచ్చలపల్లి సుందరయ్య భవన్)ను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదట సీపీఎం జెండాను రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో పార్టీ పట్టణ కార్యదర్శి గోవిందు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులంతా సంఘటితమై ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని, అదేవిధంగా సీపీఎం కార్యాలయం ప్రజా సమస్యలకు పరిష్కార వేదిక కావాలని సూచించారు. 11 సంవత్సరాల క్రితం ప్రధాని నరేంద్రమోదీ స్విస్‌బ్యాంక్‌లో దాచుకొన్న నల్లధనాన్ని భారత్‌కు తెప్పిస్తానని, ఒక్కో కుటుంబానికి రూ.15లక్షల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు.


రైతులను పట్టించుకోకుండా జీఎస్టీ సంబరాలా?

రాష్ట్రంలో జీఎస్టీ ఎత్తివేసినట్లు కూటమి ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఎంఏ గఫూర్ అన్నారు. రాష్ట్రంలో రైతు పరిస్థితి ఘోరంగా మారిందని వారిని ఆదుకునే స్థితిలో ప్రభుత్వం లేదని ధ్వజమెత్తారు. రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రైతుల భూములను సోలార్ ప్రాజెక్ట్‌లకు అప్పనంగా అప్పజెప్పే కుట్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నాయకులు రామాంజినేయులు, రాధాకృష్ణ, హనుమంతు, రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల నిర్వహణ

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు రెండో శనివారం సెలవు దినమైనప్పటికీ తరగతులు నిర్వహించడం శోచనీయమని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని జీనియస్ గ్లోబల్ జూనియర్ కళాశాలతో పాటు పలు పాఠశాలలు విద్యార్థులకు సెలవు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తుండటంతో యూనియన్ ఆధ్వర్యంలో ఆయా విద్యాసంస్థల్లోని విద్యార్థులను ఇళ్లకు పంపించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ ఆయా యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఒకవేళ కచ్చితంగా తరగతులు నిర్వహించాల్సి వుంటే పనిచేసిన రోజుకు బదులుగా మరోరోజు సెలవును ప్రకటించాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీఓ సఫరున్నిసాబేగం

ఎమ్మిగనూరుటౌన్: బాల్య వివాహలతో అనర్థాలే ఎక్కువ అని సీడీపీఓ సఫరున్నిసాబేగం అన్నారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా శనివారం 'బాలికగా నాతోనే మార్పు–రండి ముందుకు' అనే నినాదంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తే చట్టరిత్యా శిక్షార్హులవుతారన్నారు. బాల్యవివాహలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ టీం మెంబర్ బాబు, జోసెఫ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ కవిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు భాగ్యలక్ష్మి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

మంత్రాలయం రూరల్: ఆడపల్లిలను రక్షిద్దాం.. వారిని చదివిద్దామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమిత్ర అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం మండల పరిధిలోని మాలపల్లి, మండల కేంద్రమైన మంత్రాలయంలో స్థానిక అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు భీమేశ్వరి, స్వేత, సునిత, కవితలు పాల్గొన్నారు.

13న చలో విజయవాడ

ఆదోని రూరల్: ఈనెల 13న చేపట్టే చలో విజయవాడను జయప్రదం చేయాలని ధర్నా చౌక్ వద్ద చేపట్టే ధర్నాకు వేలాదిగా విద్యుత్ కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగులు తరలిరావాలని ఆదోని విద్యుత్ జేఏసీ కన్వీనర్ చైర్మన్ కె.టి.రుద్రప్ప, లక్ష్మన్నలు పిలుపునిచ్చారు. శనివారం వారు స్థానిక కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో దీర్ఘకాలిక సమస్యలైన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే తెలంగాణ ప్రభుత్వ తరహా రెగ్యులర్ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో విలీనం చేసి ఏపీఎస్పీడీసీఎల్ రూల్స్‌ను వర్తింపజేయాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి నాలుగు డీఏలను వెంటనే ఇవ్వాలన్నారు. డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి రాష్ట్రాన్ని అంధకారం చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జగ్గయ్య నాయక్, శివ చిరంజీవి, సుబ్రహ్మణ్యం, చెన్నయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి క్వింటా రూ.2500 ప్రకారం కొనుగోలు చేయాలి

ఆదోని రూరల్: ఉల్లి క్వింటా రూ.2500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర లేక పంటను తక్కువకి అమ్ముకున్న రైతులందరికీ ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో శనివారం ఉల్లి రైతు పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉల్లి రైతులకు ధర లేకపోవడంతో పొలాల్లోనే ఉల్లిని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులు పెట్టుబడులు పెట్టారన్నారు. ధర లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉల్లి రైతులు ఉన్నారన్నారు. ఈనెల 13వ తేదీన కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఉల్లి రైతుల సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు మునిస్వామి, ఉల్లి రైతులు చిన్న ఈరన్న, గంగాధర్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

ఎమ్మిగనూరురూరల్: రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలని కేవీకే సమన్వయ కర్త డా.రాఘవేంద్రచౌదిరి అన్నారు. శనివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా పీఎం ధన్ ధ్యాన్ కిసాన్ యోజన పథకం ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు, రైతు సంఘాల ఉత్పత్తిదారులు కొత్త ఉత్పత్తులపై దృష్టి సారించాలని చెప్పారు. కేవీకే శాస్త్రవేత్తలు డా. మౌనిక, డా.నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు జీపుజాతా

ఆదోని రూరల్: ఆదోని జిల్లా సాధన కోసం జీపుజాతాను శనివారం ఆదోని జిల్లా సాధన ఐక్యవేది క నాయకులు నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీపుజాతా ఆదోని మీదుగా ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పర్యటించి ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ఆదోని జిల్లా కేంద్రమైతే పై ఐదు నియోజకవర్గాలు లబ్ధి పొందుతాయన్నారు. కార్యక్ర మంలో ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్, నాయకులు నరేంద్రయాదవ్, కుబేరస్వామి, సద్దాం హుసేన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందాం



మాట్లాడుతున్న ఆదోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి వై.పి.గంగాధర్

ఆదోని టౌన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వై.పి.గంగాధర్ పిలుపునిచ్చారు. ఆదోని నియోజకవర్గంలోని మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు తలుచుకుంటే సాధించలేదన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనకబడిన ఆదోని ప్రాంతంలో జగనన్న పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు వెచ్చించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కౌన్సిలర్‌లు ఫయాజ్ అహ్మద్, అశోక్, మహిళా నాయకురాళ్లు శ్రీదేవి, సీనియర్ నాయకులు నాగరాజ్, ఎస్సీ సెల్ నాయకుడు ఏసోబు, ఆదోని మండల యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి



విచారిస్తున్న నీతి అయోగ్ టీమ్ సభ్యులు వెంకటరమణ, సీడీపీఓ రాజేశ్వరి దేవి

కోసిగి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని నీతి ఆయోగ్ టీమ్ సభ్యులు వెంకటరమణ, సీడీపీఓ రాజేశ్వరి దేవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొల్మాన్‌పేట గ్రామంలో పౌష్టికాహారం పంపిణీపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో నేరుగా విచారించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కాత్యాయిని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా పొందవచ్చునని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్స్ కాత్యాయిని, భాగ్యలక్ష్మీ బాయి సూచించారు. శనివారం కోసిగిలోని 17వ అంగన్ వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోండి

నందవరం : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ టీమ్ నీతి ఆయోగ్ సభ్యులు దేముడు నాయుడు సూచించారు. శనివారం మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో పీడీపీఓ సఫరూనిసా బేగం ఆధ్వర్యంలో నీతి ఆయోగ్ సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాలన్ని తనిఖీ చేశారు. అనంతరం చిన్నారుల బరువులు, గర్భిణులు, బాలింతలకు అందించే కిట్లను పరిశీలించారు. లబ్ధిదారుల ళ్లకు వెళ్లి వారికి అంగన్‌వాడీలు అందించే సలహాలు, సూచనలు, విజిట్లు, ఆరోగ్య సూత్రాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉరుకుందు, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ఎంపీఈఓల సమస్యలు పరిష్కరించండి

మంత్రాలయం రూరల్: ఎంపీఈఓల సమస్యలను పరిష్కరించాలని మంత్రాలయం మండల ఎంపీఈఓలు కోరారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణను విజయవాడలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రాలయం మండల సంఘం అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. వ్యవసాయ రంగంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్న తమకు న్యాయం చేయాలని, తమ జీతాలను ఇప్పటి వరకు పెంచకపోవడం బాధాకరమన్నారు. ఎంపీఈఓలు నాగసాయి, సుధాకర్, ఈశ్వరయ్య, శేషాద్రి, మోహన్‌నాయక్‌లు పాల్గొన్నారు.